





సుందర మనోహరం

ఎర్ర ఎర్రాని సూరీడు.. ఎండనిచ్చే సూరీడు... జీవకోటికి ప్రాణం సూరీడు.. పంటలకు ప్రాణం సూరీడు.. లోకబాంధవుడు సూరీడు... అందరి నేస్తం సూరీడు సప్తవర్ణాలతో ఆకాశం మబ్బుల్లో నుంచి ఉదయించాడు. ఆలయ శిఖరం, కొబ్బరి చెట్టు చాటు నుంచి లేత పసుపు, ఎరుపు వర్ణంతో కూడిన సూర్యకిరణాలు నేలను తాకిన సుందర దృశ్యం బుధవారం ధారూరులో ఆవిష్కృతమైంది.

- ధారూరు, మే 22

బ్లూకోట్ పోలీసులపై దాడి

▸ గొడవ ఆపేందుకు వెళ్లగా గొడ్డలితో దాడి ▸ ముగ్గురు అరెస్ట్

తాండూరు, మే 22: గొడవ ఆపేందుకు వెళ్లిన బ్లూకోట్ పోలీసులపై దాడి చేశారు. ఏకంగా విధి నిర్వహణలోనున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై గొడ్డలితో దాడి చేసి, పోలీసులే తమపై దాడి చేశారంటూ చిత్రీకరించిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో బాగాయిపల్లి చౌరాస్త వద్ద బ్లూకోట్ పోలీసులు నరేష్, వెంకటేష్‌లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అక్కడే కొంత మంది ద్విచక్ర వాహనదారు మధ్య గొడవ జరుగుతున్నట్లు తెలియడంతో అక్కడికి వారు వెళ్లారు. ఇద్దరు ద్విచక్ర వాహనదారులు ఓ కొన్న విషయంలో గొడవ పడుతుండగా పోలీసులు వారిని సముదాయించి అక్కడి నుంచి పంపే ప్రయత్నం చేశారు. మద్యం మత్తులో ఉన్న వాహనాదారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేయడానికి ప్రయత్నించగా రాంచందర్ అనే వ్యక్తి పోలీసులపై దాడి చేశారని,పవన్‌కుమార్ అనే మరో వ్యక్తి గొడ్డలితో దాడి చేశారని సీఐ తెలిపారు. కేసు విచారణ అనంతరం నాగులపల్లి గ్రామానికి చెందిన జుట్టు పవన్‌కుమార్, చెంగోల్ గ్రామానికి చెందిన మాల రాంచందర్, మాలవిజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. మరో వ్యక్తి నర్సింహులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

దారి పొడవునా ధాన్యమే

బషీరాబాద్ మండలంలోని మైల్వార్ గ్రామ సమీపంలో తెలంగాణ-కర్ణాటక లింకు రోడ్డులో కిలోమీటరు మేర రైతులు ధాన్యం ఆరబోశారు. తేమశాతం తగ్గిన తర్వాత అమ్ముతున్నారు. దారి పొడవునా ధాన్యం ఆరబోతతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రాలకు పక్కా స్థలాలు లేక, రైతులకు కల్లాలు లేకపోవడంతో రోడ్లపై ఇలా ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు.

- బషీరాబాద్, మే 22

టైంపాస్ పనులు చేయకండి

▸ విద్యార్థుల కొలతలు లేకుండా

బట్టలు కుట్టినా డబ్బులు చెల్లించడం కుదరదు

▸ ఐకేపీ ఏపీఎంపై కలెక్టర్ నారాయణరెడ్డి ఆగ్రహం

పెద్దేముల్, మే 22: పిల్లలకు కొలతల ప్రకారం ఏకరూప దుస్తులు కుట్టించాలని పదేపదే చెపుతున్నాము. అయినా మీలో మార్పు రావడం లేదు. కొలతలు లేకుండా ఎలా బట్టలు ఇచ్చావు. విద్యార్థులకు సంబంధించిన కొలతలు ఇచ్చి బట్టలు కుట్టించండని ఐకేపీ ఏపీఎం బాలయ్యపై కలెక్టర్ నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలతలు లేకుండా ఒకవేళ మీరు బట్టలు కుట్టినా తాము డబ్బులు ఇవ్వడం కుదరదని మహిళాసంఘం సభ్యులకు కలెక్టర్ ఖరాకండిగా చెప్పేశారు. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, మంబాపూర్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. మే 30లోగా పనులు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను ఇప్పటికే మంజూరైన నిధులతో పక్కాగా పనులు చేయాలని సూచించారు. అనంతరం మంబాపూర్ గ్రామంలోని టైలరింగ్ షాపులో మహిళాసంఘాల ద్వారా విద్యార్థులకు కుట్టిస్తున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులకు ఏ సైజుల్లో దుస్తులు కుట్టించాలనే విషయాన్ని టైలరింగ్ పనులు చేస్తున్న మహిళలకు ఐకేపీ ఏపీఎం వివరాలు ఇవ్వలేదు. కేవలం ఆయా తరగతుల్లో ఇంతమంది విద్యార్థులు ఉన్నారనే విషయాన్ని మాత్రమే రిజిష్టర్‌లో రాసి



మంబాపూర్‌లో టైలరింగ్‌షాపులో దుస్తులను పరిశీలించి ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

ఇచ్చారు. సైజుల వివరాలు ఎక్కడున్నామని కలెక్టర్ అడగడంతో రిజిష్టర్‌ను చూపించడంతో అది చూసి కలెక్టర్ ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎన్నిసార్లు చెపుతున్నా మీరు ఎందుకు వినడం లేదు. కేవలం టైంపాస్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు సాయంత్రానికి టైలరింగ్‌షాపులో విద్యార్థుల సైజులు ఉండాలని ఆదేశించారు. ఒకవేళ అధికారులు మీకు విద్యార్థుల సైజులు ఇవ్వకుంటే మీరు దుస్తులు కుట్టవద్దని వారికి ఖరాకండిగా చెప్పేశారు. సైజులు లేకుండా దుస్తులు కుడితే వాటి డబ్బులు తాము చెల్లించమని అన్నారు. అంతేకాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఈనెల 31వరకు ధాన్యం మొత్తం సేకరించడం పూర్తి చేయాలని చెప్పారు. ఇప్పటికి ఇంకా ఎవరైనా వరి కోతలు చేయకుండా ఉంటే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని వారి ధాన్యాన్ని కూడా కొంటామని చెప్పారు.

పనులను నాణ్యతగా చేపట్టాలి


యాలాల: యాలాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మాధ్యమ పాఠశాలల పనులను కలెక్టర్ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులన్నింటినీ ఈనెల 30 తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బెన్నూర్ లో ధాన్యం సేకరణ కేంద్రాన్ని సందర్శించి అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లోగా ధాన్యాన్ని సేకరించి రైస్ మిల్లర్లకు చేరవేయాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణబాయి, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ పాండురంగం, డీఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, పంచాయతీరాజ్ ఏఇ వంశీ కృష్ణ, ప్రమీల, మల్లమ్మ, తన్వీర్ ఫాతిమా పాల్గొన్నారు.

చచ్చిపోతున్నాయ్!

ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలోని లక్ష్మీనారాయణ చెరువు కాలుష్య కాసారంగా మారింది. చెరువులోని నీరంతా హాలాహలాన్ని తలపిస్తోంది. ఈ ప్రాంతానికి గుదిబండగా మారిన జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, చర్లపల్లి పారిశ్రామిక వాడ నుంచి నిత్యం వెలువడుతున్న రసాయనాలు ఈ చెరువులోకి చేరుతున్నాయి దీంతో చెరువులోని జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. అంతేకాకుండా మూసీ పరీవాహక ప్రాంతంలోని చెరువులు, కుంటల్లో చేపల పెంపకమూ కత్తిమీద సాములా మారింది. మత్స్యకారులు రోడ్డున పడతున్నారు.



ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో మృతి చెందిన చేపలు (ఫైల్)



డంపింగ్‌యార్డు నుంచి కాలుష్య జలాలను మోసుకొస్తున్న ఎరిమల్లెవాగు

- ▸ కాలుష్యకోరల్లో ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు
- ▸ చెరువులోకి పారిశ్రామికవాడ, డంపింగ్‌యార్డు వ్యర్థాలు
- ▸ రసాయన జలాలతో చెరువులోని చేపలు మృత్యువాత
- ▸ కాలుష్యంతో కుంటుపడిన సాగు.. తగ్గిన దిగుబడి
- ▸ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని మత్స్యకారుల ఆవేదన
- ▸ చెరువులో వ్యర్థాలు కలువకుండా చర్యలు తీసుకోవాలి : గ్రామస్తులు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్‌రూరల్, మే 22 : ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలోని లక్ష్మీనారాయణ చెరువు కాలుష్య కాసారంగా మారింది. దీంతో చెరువులోని జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. 600 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న సువిశాలమైన ఎదులాబాద్ చెరువు గతంలో తాగు, సాగు నీటికి ప్రధాన వనరుగా ఉండేది. సాగు కోసం మూసీ నది నీటిని పీర్జాదిగూడనున్న నారాయణ కత్వ(ఆనకట్ట) కాలువ ద్వారా చెరువులోకి మళ్లించటంతో సమస్య ఉత్పన్నమైంది. మొదట్లో సాగునీటి ఇబ్బంది తీరింది. దూర దృష్టితో మూసీ నీటిని చెరువులోకి వదలటంతో కాలక్రమేణ చెరువు కాలుష్యబారిన పడింది. ఈ ప్రాంతానికి గుది బండగా మారిన జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, చెర్లపల్లి పారిశ్రామిక వాడ నుండి నిత్యం వెలువడుతున్న వ్యర్థ రసాయనాలు రాంపల్లి, యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, ఘట్‌కేసర్, బొక్కోనిగూడ గ్రామాల గుండా పయనిస్తున్న ఎరిమల్లె వాగు, బొంతకుంట వాగుల ద్వారా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులోకి చేరుతుంది. దీంతో చెరువులోని నీరు పూర్తిగా విషతుల్యమవటంతో చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయి. మూసీలో అనేక రకాల రసాయనాలు కలవటంతో చెరువులోని చేపలు మృతి చెందటం సర్వ సాధారణమైంది. ఆ చేపలను భుజించిన వారూ వ్యాధిగ్రస్తులయ్యే ప్రమాదమేర్పడింది. ఇటీవల కురిసిన అకాల వర్షంతో ఎరిమల్లివాగుకు కొద్దిపాటి వరద వచ్చింది. దీంతో వాగు పొడుగున, ఎదులాబాద్ చెరువులో అధిక శాతం చేపలు చనిపోయి పైకి తేలాయి. ఈ క్రమంలో మత్స్యకారులతో పాటు అన్నదాతలు జీవనోపాధి కోల్పోవలసిన దుస్థితి ఏర్పడింది.

తగ్గిపోతున్న పంట దిగుబడి

అదేవిధంగా మూసీ పరివాహక ప్రాంతంలోని చెరువులు, కుంటల్లో చేపల పెంపకమూ కత్తిమీద సాములా మారింది. దీంతో మూసీ పరివాహక ప్రాంతమంతా రసాయన వ్యర్థాలతో నిండింది. సాగు భూమి నిస్సారమవటంతో పరివాహక ప్రాంతంలో పంట దిగుబడి ఘణనీయంగా తగ్గింది. డంపింగ్‌యార్డు, చెర్లపల్లి పారిశ్రామిక వాడ నుంచి వస్తున్న నీటినీ నేరుగా మూసీలోకి మళ్లించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు వరి పంటను తగ్గించి, గిన్ని గడ్డి సాగుకు మొగ్గు చూపారు. చెరువు ఎండిపోయినప్పటికీ మూసీ నీటితో చెరువును నింపి మరీ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇలా చేయటంతోనూ చెరువులోని నీరు విషతుల్యమౌతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పూడుకుపోతున్న చెరువు

నిమజ్జన అనంతరం చెరువులో పోగైన వ్యర్థాలను తొలగించకపోవటంతో చెరువు పూడుకుపోతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ దుస్థితిపై స్థానికులు, మత్స్యకారులు, రైతులు సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతనిధులు ఈసమస్యపై దృష్టిసారించి, చెరువును కాలుష్య కోరల నుండి పరిరక్షించాలని కోరుతున్నారు.



ఘట్‌కేసర్ వద్ద పారుతున్న ఎరిమల్లెవాగు

రసాయన వ్యర్థాలతో ముప్పు



జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుతో పాటు చెర్లపల్లి పారిశ్రామిక వాడ నుంచి వచ్చే విష రసాయన జలాలతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ జలాల్లో ఘన, ద్రవ రసాయనాలు ఉండటంతో నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోవటంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. డంపింగ్‌యార్డు నుంచి వెలువడే రసాయన జలాలను శుద్ధి చేసి వదలాలి. ఈ రసాయన జాలాల్లో పెంచిన చేపలను ఆహారంగా తీసుకున్నా ప్రమాదకరమే. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి పర్యావరణాన్ని కాపాడాలి.

- డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి, పర్యావరణ వేత్త




చేపలు మృత్యువాత పడుతున్నాయి

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, చెర్లపల్లి పారిశ్రామిక వాడ నుంచి నిత్యం వెలువడుతున్న వ్యర్థ రసాయనాలు ఎరిమల్లె వాగు, బొంతకుంట వాగుల ద్వారా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులోకి చేరుతుంది. దీంతో చెరువులోని నీరు పూర్తిగా విషతుల్యమవటంతో చేపలు పెద్దఎత్తున మృత్యువాత పడుతున్నాయి. దీంతో 650 కుటుంబాలు రోడ్డున పడ్డాం. పలుమార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేదు. అధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టి చేపలు మృతి చెందకుండా చర్యలు తీసుకోవాలి.

- పూస యాదగిరి, ఎదులాబాద్, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు

మూసీ ప్రక్షాళన చేపట్టాలి



రసాయన వ్యర్థాలతో చెరువులోని నీరు పూర్తిగా కలుషితమైంది. తద్వారా సాగు కుంటుపడింది. ఈ చెరువు కింద రెండువేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. నీటి కాలుష్య కారణంగా ఈ ప్రాంతంలో ఉత్పత్తైన ధాన్యం నల్లగా మారి, తాలు శాతం అధికమౌతుంది. నీటి కాలుష్యంతో ఇతర పంటలు సాగు కనాకష్టంగా మారింది. ప్రభుత్వం వెంటనే మూసీ ప్రక్షాళన చేపట్టి మూసీపరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి.

బట్టె శంకర్, మూసీ పరిరక్షణ సమితి కన్వీనర్, ఎదులాబాద్

సాగు ప్రణాళిక ఖరారు!

▸ జిల్లాలో 28,115వేల ఎకరాల్లో పంటల సాగు అంచనా

మేడ్చల్ మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సాగుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. గతేడాది వానాకాలం సీజన్‌లో సరైన వర్షాలు లేక, వరి, పత్తి పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకి రైతులు పూర్తిగా నష్టపోయారు. యాసంగి సీజన్‌లో సరైన నీటి సౌకర్యం లేక ఆశించిన స్థాయిలో పంటల సాగు చేయలేదు. అయితే కొద్ది రోజులుగా మోస్తరు వర్షం కురుస్తుండడంతో వానాకాలం పంటల సాగుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో 28,115 ఎకరాల్లో పంటల సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

అవగాహన కల్పిస్తేనే ప్రయోజనం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన తెలంగాణ- మన వ్యవసాయం కార్యక్రమం అమలు చేసి వానాకాలం సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం నిర్వహించడం లేదు. జిల్లాలో 5 మండలాల పరిధిలో మొత్తం 15 వేల మంది రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ పరిధిలో 7 మంది ఏవోలు, 9 మంది ఏఈఓలు విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఒక ఏఈవోకు రెండు, మూడు గ్రామాలను అప్పగించారు. ఏఈవోలు 5 వేల



ఎకరాల్లో సాగు చేసే పంటలను పర్యవేక్షణ చేయనున్నారు. ప్రస్తుతం వివిధ కంపెనీల విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖాధికారులు అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పంటల సాగు అంచనా

వరి 18,900 ఎకరాలు, కందులు 50 ఎకరాలు, మొక్కజొన్న 250 ఎకరాలు, 25 ఎకరాల్లో జొన్న, 130 ఎకరాల్లో పత్తి, 25 ఎకరాల్లో మినుములు, పండ్ల తోటలు 4,170 ఎకరాలు, కూరగాయలు 1820 ఎకరాలు, ఇతర రకాల పంటలు 520 ఎకరాల్లో సాగుతు అవుతుందని ప్రణాళికలు రూపొందించారు.

విత్తనాల అవసరం

జిల్లాలో సాగు విస్తీర్ణాన్ని బట్టి వరి ఇతర పంటలతో కలుపుకుని మొత్తం 5వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం పడుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. వరి 4,725, మొక్కజొన్న 250, పత్తి 130 క్వింటాళ్ల విత్తనాలు అవసరం పడుతాయని అధికారులు అంచనా వేశారు. అదేవిధంగా రైతులకు కావాల్సి ఎరువులు కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. యూరియా 2,194, డీఏపీ 2,345, కాంప్లెక్స్ 29,327 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

కార్యాచరణ సిద్ధం చేశాం

వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేయాల్సిన పంటలపై అవగాహన కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- మేరీ రేఖా, జిల్లా వ్యవసాయాధికారి



అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేయిస్తున్న న్యాయాధికారి

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వినూత్న తీర్పు

▸ అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేయించిన న్యాయాధికారి

వికారాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి వికారాబాద్ జడ్జి బుధవారం వినూత్న తీర్పు వెలువరించారు. ఈ నెల 20న వికారాబాద్ పట్టణంలో పోలీసుల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ నవాబుపేట మండలానికి చెందిన విఠల్, శేఖర్, నర్సిములు పట్టుబడ్డారు. వీరిని వికారాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా, న్యాయాధికారి నామాల అశోక్ ముగ్గురికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే అనాథాశ్రమంలోని వృద్ధులకు మందులు కొనుగోలుకు రూ.వెయ్యి, పండ్ల కొనుగోళ్లకు అదనంగా రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని తీర్పు నిచ్చారు. తీర్పు అమలును పర్యవేంచేందుకు జడ్జి జరిమానా విధించిన ముగ్గురితో పాటు వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కొంపల్లి శివారులో ఉన్న మహితా మినిస్ట్రీస్ అనాథ ఆశ్రమానికి వెళ్లారు. పండ్లను వారితో పంపిణీ చేయించి మందుల కొనుగోలు కోసం రూ. వెయ్యి చెల్లించి రశీదు తీసుకున్నారు. అనంతరం వృద్ధులు, అక్కడున్న అనాథ పిల్లల యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని వారికి రూ.10వేల ఆర్థికసాయం అందించి జడ్జి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ చర్యతో ప్రజల నుంచి న్యాయాధికారికి అభినందనలు వెల్లువెత్తాయి.

అప్రమత్తతకు సాంకేతిక దన్ను

● వర్షపాతం, పిడుగు పాటును ముందే పసిగట్టేలా యాప్‌లు
● డౌన్‌లోడ్ చేసుకుంటే రైతులు, సామాన్యులకు మేలు


దౌల్తాబాద్, మే 22 : అకాల వర్షాలు అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చాయి. ఏ రోజు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి. వర్షాలు, పిడుగుపాటుకు మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి ప్రకృతి విపత్తుల నుంచి రైతులను, ప్రజలను అప్రమత్తం చేసి వారికి దన్నుగా నిలిచేందుకు కేంద్ర వాతావరణ శాఖ ప్రత్యేక యాప్‌లను రూపొందించింది. వీటిని స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే ఏ సమయంలో వర్షం కురుస్తుందో, ఎక్కడ పిడుగు పడే ఆస్కారం ఉందో అనే సమాచారాన్ని భారత వాతావరణ శాఖ రూపొందించిన యాప్‌ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా ఐదు రోజుల ముందుగా వాతావరణ పరిస్థితులపై తెలుసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లోంచి మూడు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతీ యాప్‌కు వినియోగదారుడి పూర్తి వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది.

● రెయిన్ అలారం

రెయిన్ అలారం యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



రెయిన్ అలారం యాప్



దామిని యాప్



మేఘదూత్ యాప్

వర్షాలతో కల్లాల్లో వడ్లు తడిసిపోయి రైతులకు నష్టం కలుగుతుంది. రెయిన్ అలారం యాప్ ద్వారా వినియోగదారుడు అందించిన వివరాల మేరకు దాదాపు 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ వర్షం కురిసే సూచనలున్నాయో అనే సమాచారాని అందిస్తుంది. ఈ మేరకు రైతులు అప్రమత్తం అయ్యేం అవకాశం ఉంటుంది.

● దామిని యాప్

ఏప్రిల్, మే నెలల్లో ఈదురు గాలులు వీచి అకాల వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉంటుంది. పొలాల వద్ద రైతులు, కూలీలు, ప్రయాణాల్లో ఉన్న వారు వర్షం ప్రారంభం రాగానే చెట్ల కిందికి వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. వర్షం కురిసే సమయంలో చెట్ల కిందికి వెళ్లడం ప్రమాదకరం. ఎర్తింగ్‌తో చెట్లపై పిగుడులు పడే ఆస్కారం ఉంటుంది. దామిని యాప్ ద్వారా 5 నుంచి 20 నిమిషాల్లో 20కిలో మీటర్ల దూరంలో ఎక్కడ పిడుగు పడుతుందో సమాచారం అందుతుంది.

● మేఘదూత్ యాప్

రైతులు పంటలకు రసాయనిక ఎరువులు పిచికారి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పిచికారి చేసి ఇంటికి వచ్చే సరికి వర్షం కురిసి మందులు వృథా అవుతుంటాయి. ఇలాంటి ఇబ్బందులను తొలగించేందుకు వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను తెలియజేస్తుంది. రానున్న ఐదు రోజుల్లో వాతావరణంలో మార్పులు, వర్ష సూచన, ఆకాశం మేఘావృతం, ఈదురు గాలులు ఏ మేరకు ఏ దిశ నుంచి ఎటు వైపునకు వీస్తాయనే సమాచారాన్ని అందిస్తుంది.



పాడి రైతులకు కార్డులు అందజేస్తున్న సత్యనారాయణ

'హెరిటేజ్' పాడి రైతులకు రూ.2 లక్షల ప్రమాద బీమా సదుపాయం

కడ్తాల్, మే 22 : రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను చేపట్టి లాభాలు గడించాలని హెరిటేజ్ డెయిరీ జోనల్ ఇన్‌చార్జి సత్యనారాయణ, ఏరియా మేనేజర్ వెంకటేశంలు అన్నారు. హెరిటేజ్ డెయిరీకి పాలు పోసే ప్రతీ రైతుకు రూ.2 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కడ్తాల మండలం మద్దెల కుంట తండాలో బుధవారం హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ, వెంకటేశంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెరిటేజ్ ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను పాడి రైతులకు వివరించారు. సబ్సిడీపై దాణా, పాడి ఆవులకు ఇన్సూరెన్స్ సౌకర్యం, రుణసదుపాయం, పశుపోషణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టాక్‌రాజ్‌గూడ బీఎంసీ ప్లాంట్ మేనేజర్ నరేశ్, సూపర్‌వైజర్ శివ, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి ఉషారాణి

ఆయిల్‌పామ్ సాగుతో ఎంతో మేలు

కేశంపేట, మే 22: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, రైతులకు అన్నివిధాలా లాభదాయకమని మండల ఉద్యానవన శాఖ అధికారి ఉషారాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట సాగుకు అన్ని విధాలా చేయుతనందిస్తుందని ఉషారాణి తెలిపారు. కేశంపేట మండలం లేమామిడి గ్రామంలో బుధవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ, అవగహన సదస్సు నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో లేమామిడి, బొదునంపల్లి, గాంధీ శంకర్‌పల్లి, తొమ్మిదిరేకుల, కాకునూర్ గ్రామాలకు చెందిన రైతుల పాల్గొన్నారు. అయిల్‌పామ్ సాగు, దిగుబడి, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం గురించి ఉషారాణి రైతులకు వివరించారు. నీటి వసతి ఉన్న భూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ పంటకు చీడ, పీడల బాధకూడా తక్కువ ఉటుందని తెలిపారు. ఆయిల్‌పామ్ దిగుబడి ఎకరానికి 8 నుంచి 12 టన్నులు వస్తుందని వివరించారు. పంటకు పెట్టుబడిగా ప్రభుత్వం మొక్కలపై 90 శాతం రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌కు 80 నుంచి 100 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. మొక్క నాటిన నాలుగు సంవత్సరాల వరకు ఎకరాకు రూ. 4,200 నిర్వహణ ఖర్చులు ఇస్తుందన్నారు. నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి మొదలై 30సంవత్సరాల వరకు వస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులకు డైరీలు అందించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజరత్నం, ఏవో శిరీష, ఆయిల్‌పామ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, ఏరియా మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ ఆఫీసర్ రుక్మిణి, ఏఈవోలు సమీరా, వినయ్, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




పోలీసులు స్వాధీనం చేసుకున్న హిటాచీ

అక్రమంగా మట్టి తవ్వకాలు

▸ హిటాచీని సీజ్ చేసిన పోలీసులు

కేశంపేట, మే 22: మండల పరిధిలోని భైర్కాన్‌పల్లి గ్రామ శివారులోని పో సముద్రంలో నుంచి కొందరు అక్రమంగా మట్టిని తవ్వుకుని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమ దందాకు తెరలేపారు. వివరాల్లోకి వెళితే.. సర్వే నెంబర్ 52, 53లలో పో సముద్రం చెరువు ఉంది. ఇందులో సర్వే నెంబర్ 52లో కొంతమేర పట్టాభూమి ఉంది. ఇది ఎఫ్‌టీఎల్‌లో ఉంటుంది. అయితే, కొత్తూర్ మండలం సిద్దాపూర్‌కు చెందిన కొందరు అక్రమార్కులు పోలీసు ఉన్నతాధికారుల పేరును ఉపయోగించుకొని మట్టి అక్రమ రవాణాకు తెరలేపారు. బుధవారం పో సముద్రంలో నుంచి మట్టిని టిప్పర్లతో తరలిస్తున్నరన్న సమాచారంతో రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే అక్కడి నుంచి టిప్పర్లను తరలించారు. మట్టిని తోడిన హిటాచీ అక్కడే ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. అయితే, అక్రమ మట్టి వ్యాపారులు రెవెన్యూ, పోలీసులతో పాటు జర్నలిస్టులను బెదిరింపులకు గురిచేశారు. ఓ పోలీసు ఉన్నతాధికారికి చెందిన భూమి అని.. మీరు ఎవ్వరూ ఏమీ చేయలేరని బెదిరించారు. కేశంపేట పోలీసులు ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నారు.



ప్రహరీ కూలి ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి రెయిలింగ్

వాహనదారులూ జర భద్రం

▸ ప్రమాదకరంగా తక్కళ్లపల్లి బ్రిడ్జి రెయిలింగ్

యాచారం, మే 22 : హైదరాబాద్-నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై తక్కళ్లపల్లి గేటు వద్ద బ్రిడ్జి ప్రమాదపు టంచునకు చేరింది. ఈ బ్రిడ్జి నిర్మించి 30 ఏళ్లు కావొస్తుంది. బ్రిడ్జికి ఇరువైపులా నిర్మించిన రెయిలింగ్ దిమ్మెలు కూలిపోతున్నాయి. ఇప్పటికే మూడుచోట్ల కూలిపోవడంతో పాటు మరో రెండు చోట్ల కూలడానికి సిద్ధంగా ఉంది. కాగా, వాహనాదారులకు ఇబ్బందిగా మారడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకోవడంతోనే రెయిలింగ్ కూలిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు మరమ్మతులు చేసి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





పరిగి మార్కెట్‌లో అల్లనేరడు అమ్మకాల దృశ్యాలు

అల్లనేరడుపై యమక్రేజ్!

▸ కిలో పండ్లు రూ.300

▸ పట్టణాల్లో జోరుగా అమ్మకాలు

▸ అల్లనేరడిలో అనేక ఔషధ గుణాలు

పరిగి, మే 22 : జిల్లాలోని మార్కెట్లలో అల్లనేరడు పండ్ల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో కాపుకొచ్చే అల్లనేరడి పండ్లను జనం ఇష్టపడి కొంటున్నారు. అల్లనేరడిలో ఆయుర్వేద గుణాలు అనేకం ఉన్నాయి. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, పట్టణాల్లో బండ్లపై అల్లనేరడి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అల్లనేరడి రేటు కూడా ప్రియంగానే ఉంది. కిలో పండ్లు రూ.250 నుంచి రూ.300 వరకు కిలో అమ్ముతున్నారు. ధర ఎక్కువ ఉన్నా జనం ఇష్టంతో కొనుగోలు చేసి తింటున్నారు. పరిగి, తాండూరు, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో, అడవుల్లో లభించే పండ్లు మార్కెట్లలో విరివిగా లభిస్తున్నాయి. పట్టణాల్లో ఎక్కడ చూసినా అల్లనేరడి కనిపిస్తున్నాయి. పూడూరు, దోమ, ఊటుపల్లి తదితర గ్రామాల్లో అల్లనేరడి తోటలను పెంచుతున్నారు. ఇక్కడ పండించిన పండ్లను జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముతున్నారు.

అల్లనేరడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు

అల్లనేరడి పండ్లలో ఔషధ గుణం ఉంటుంది. ఈ పండ్లు తినడం ద్వారా వివిధ రకాలుగా విటమిన్లు లభ్యమైతాయి. డయాబెటీస్ రోగులకు ఈ పండ్లు, వాటి విత్తనం మేలు చేస్తాయి. సీజన్‌లో రోజు ఐదారు పండ్లు తినడం ద్వారా చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. కిడ్నీ సంబంధ వ్యాధులను కూడా నయం చేస్తుంది. కిడ్నీలో





చిన్న సైజు రాళ్లు ఉన్న వారు ఈ పండ్లు తింటే కరిగిపోతాయి. అల్లనేరడి పండు ఒకటి, రెండు వ్యాధులకే కాకుండా శరీరానికి అన్ని రకాలా మేలు చేస్తుంది. సీజన్‌లో ఈ పండ్ల ధర ఎంత ఉన్నా కొని తినాలి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి

ఆలంఖాన్‌గూడలో మంచినీటి కొరత

▸ పట్టించుకోని అధికారులు.. గ్రామస్తుల ఇక్కట్లు

శంకర్‌పల్లి, మే 22 : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన తయారైంది ఆలంఖాన్‌గూడ గ్రామస్తుల పరిస్థితి. ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా తయారవ్వడంతో గ్రామస్తులు తీవ్ర మంచినీటి కొరత ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రెండు మంచినీటి ట్యాంకులు ఉన్నా.. నీళ్లు సరిపోవడం లేదు. కాగా మిషన్‌భగీరథ నీరు సరిపోను వస్తున్నా.. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు నీటికొరత ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మంచినీటి కోసం రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా, రెండు వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. అయితే, రోడ్డు వేసే సమయంలో వాటిని పూర్తిగా మూసివేశారు. రెండు వాల్వ్‌లను మూసి వేయడంతో పల్లపు ప్రాంతంలో ఉన్నవారికి సరిపోని నీళ్లు అందుతుండగా, ఎత్తైన ప్రాంతంలో ఉన్నవారికి నీళ్లు సరిపోకపోవడంతో వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. దీంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎంతో ఆర్భాటంగా కుళాయిలను ఇంటి ముందు ఏర్పాటు చేసినా.. చుక్కనీరు రాదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి పంపులు సైతం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు తెలిపారు. నీళ్లు సరిపోకపోవడంతో బోర్లు ఉన్న ఇంటి యజమానుల వద్ద నుంచి తెచ్చుకుని గొంతు తడుపుకుంటున్నామని వాపోతున్నారు. ఎన్నోసార్లు గ్రామకార్యదర్శికి మొరపెట్టుకున్నా.. సమస్య తీరడం లేదని తెలిపారు. మండు వేసవిలో తమ పరిస్థితి ఏ అధికారి సైతం పట్టించుకోకపోవడంతో కష్టాలు తప్పడం లేదని మహిళలు ఆక్రోశం వెళ్లగక్కారు. అధికారులు ఇప్పటికైనా మూసిన వాల్వ్‌లను తెరిపించడంతో పాటు మరిన్ని వాల్వ్‌లను ఏర్పాటుచేసి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుచున్నారు. ఈవిషయమై ఎంపీడీవో వెంకయ్యాగౌడ్‌ను వివరణ కోరగా గ్రామాన్ని సందర్శించి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తానని తెలిపారు.





పూడ్చివేసిన వాల్వ్ ప్రాంతాన్ని చూపిస్తున్న గ్రామస్తులు

నీళ్లు సరిపోను రావడం లేదు



సరిపోను నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా ఇల్లు ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో నీళ్లు రావడం లేదు. ట్యాంకు సమీపంలో ఉన్నా లాభం లేదు. బోర్లు ఉన్నవారి వద్ద నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నాం.

- కైల సుమిత్ర, ఆలంఖాన్‌గూడ

వాల్వ్‌లు ఏర్పాటు చేయాలి



వాల్వ్‌లను ఏర్పాటుచేసి మూసివేశారు. పల్లపు ప్రాంతంలోని వారికి మాత్రం నీళ్లు రాగా.. ఎత్తైన ప్రాంతంలోని వారికి నీరు రావడం లేదు. పూడ్చిన వాల్వ్‌లను పునరుద్ధరించి నీటి సమస్య తీర్చాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రామన్నోళ్ల అంజయ్యగౌడ్, ఆలంఖాన్‌గూడ

కేశవ చిత్రాలయంలో ఆధ్యాత్మిక శోభ

▸ ఘనంగా అష్టాదశ గురుపీఠం ఆవిష్కరణ



అష్టాదశ గురుపీఠం ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్ శాస్త్రి

కొత్తూర్, మే 22: మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ శివారులో వెలసిన కేశవ చిత్రాలయంలో గురు పూర్ణిమను పురస్కరించుకుని బుధవారం రాత్రి అష్టాదశ గురుపీఠం ఆవిష్కరణను వ్యాస పీఠాధీశులు(వేదవ్యాస ధామ్ నైమిశారణ్య క్షేత్రం-ఉత్తరప్రదేశ్) శ్రీఅనిల్‌కుమార్ శాస్త్రి స్వామి మహరాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే 64 చతుష్షి కళలకు సంబంధించి ఏర్పాటుచేసిన చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. కేశవ చిత్రాలయం (పంచభూతీశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, రాష్ట్రపతి పురస్కార్ గ్రహీత డాక్టర్ పీజీ కేశవులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. గురుపీఠం ఆవిష్కరణతో కేశవ చిత్రాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వ్యాసపీఠాధీశులు అనిల్‌కుమార్ శాస్త్రి మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూ, ముట్టూ ఎక్కడా లేనివిధంగా 64 చతుష్షి చిత్ర కళాశాలను ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమన్నారు. వ్యాస మహర్షి పరిపూర్ణ అనుగ్రహం, మహిమాన్వితమైన మహాశక్తి ఈ ప్రాంతంలో ఉండడం వల్ల, శిష్యగణం అన్ని కళల్లో ఉత్తీర్ణులై, జీవనోపాధికి మార్గం కలగాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తన చేతుల మీదుగా అష్టాదశ గురుపీఠం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకుమారి, ధర్మేంద్ర స్వామీజీ, కంచర్ల గోపన్న మునిమనవడు వెంకటరమణ, రామలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు



జి.అరుంధతి, పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్

మేడ్చల్ టౌన్, మే 22 : మేడ్చల్‌లో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేశామని మేడ్చల్ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల కోఆర్డినేటర్, కాలేజీ ప్రిన్సిపాల్ జి.అరుధతి బుధవారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 24న నిర్వహిస్తున్నామని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష నిర్వహణకు మేడ్చల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్ఎస్ఆర్ కళాశాల, స్ఫూర్తి కళాశాల, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, ప్రభుత్వ ఐటీఐ, హైటెక్ పాఠశాల, హైటెక్ మోడర్న్ స్కూళ్లలో 8సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. పాలిటెక్నిక్‌లోని మూడు సంవత్సరాల కోర్సులకు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు, వ్యవసాయ డిప్లమా, వెటర్నరీ డిప్లమా కోర్సులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష రాసే విద్యార్థులను గంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సీఎంఆర్ షీట్‌లను రెండు వైపులా నింపి ఇవ్వాలని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

▸ సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

▸ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్యగౌడ్

కడ్తాల్, మే 22: గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి అందక మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథిని సంఘం నాయకులతో నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయమై నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో లోగడ చేసిన పనుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో గత ప్రభుత్వ ఆదేశానుసారం వైకుంఠ ధామాలు, పల్లెప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డ్‌లు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్యం, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు తదితర పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. ఆయా పనులకు ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో అప్పటి సర్పంచ్‌లు లక్షల రూపాయలు అప్పులు చేసి పనులు పూర్తి చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గత, ప్రస్తుత ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడం సరికాదని లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్యగౌడ్‌లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, ఉపాధ్యక్షుడు గంటి మదుసూధన్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, సముద్రాల రమేశ్, పంబ కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కొర్విచెడ్ వద్ద పొలాన్ని ట్రాక్టర్‌తో చదను చేస్తున్న రైతు

వేసవి దుక్కులతో ఎంతో మేలు

బషీరాబాద్, మే 22: వాన కాలం సీజన్‌కు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు తమ పొలాలను ట్రాక్టర్లు, గుంటక, నాగళ్లతో దుక్కులు, యంత్రాలతో చదను చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో రైతులు పొలాల్లో దుక్కులు సిద్ధం చేసుకుంటే మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గతంలో సాగుచేసిన పంటలు పూర్తి కాగానే వేసవి దుక్కులు సిద్ధం చేసేవారు. వానకాలం సీజన్ ప్రారంభమయ్యే నాటికి రెండు, మూడు సార్లు వేసవి దుక్కులు దున్నేవారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా వర్షాలు పడగానే హడావుడిగా దుక్కులు సిద్ధం చేసి అప్పటికప్పుడే విత్తనాలు నాటుతున్నారు.దీని వల్ల విత్తనాల మొలకల శాతం తగ్గుతుందని, అంతే కాక మొలిచిన మొలకలు ఆరోగ్యంగా ఎదగక దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వేసవి దుక్కులు లోతుగా చేయడం వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాలపై బషీరాబాద్ ఏవో సూర్యప్రకాష్ ఇలా వివరించారు.

దుక్కలతో ప్రయోజనాలివీ..

ప్రతి రైతు తప్పనిసరిగా దుక్కులు లోతుగా దున్నుకోవాలి. ఏడాది సాగు చేసిన పంటకు తెగుళ్లు, రోగాలకు సంబంధించిన రకరకాల లార్వా భూమి పొరల్లో ఉంటాయి. వేసవి దుక్కులతో అవి బయటకు వచ్చి ఎండ తీవ్రతకు చనిపోతాయి. దీంతో పాటు గత ఏడాది సాగు చేసిన పంటల వ్యర్థాలు భూమిలో కలిసిపోయి ఎరువుగా మారతాయి. భూమి పొర గుల్లగా మారి మట్టిలోకి గాలి వెళ్తుంది. దుక్కితో వర్షపు నీరు భూమికి ఇంకి చల్లబడుతుంది. చల్లబడ్డ నేలలో విత్తనాలు వేస్తే మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. అలాగే మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయని తెలిపారు.




తండాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గిరిజనుల ఆందోళన

కులకచర్ల, మే 22: తండాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మండలంలోని ఘనపూర్ పంచాయతీ పరిధి గోప్యానాయక్, సుబ్యానాయక్, సక్ర్యానాయక్ తండాల గిరిజనులు బుధవారం కులకచర్లలోని సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. సబ్‌స్టేషన్‌లో ఉన్న ఏఈ సాయికృష్ణ వినతిపత్రం తీసుకునేందుకు బయటకు రాకపోవడంతో విద్యుత్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏఈ వచ్చి వినతి పత్రాన్ని తీసుకున్నారు. తండాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోందని, సిబ్బందికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని, పంచాయతీ బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. విద్యుత్ స్తంభాలు లేక దీపాలు వెలగడం లేదన్నారు. అధికారులు స్పందించకుంటే కులకచర్ల చౌరస్తాలో ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నర్సరీ, డంపింగ్ యార్డును పరిశీలించిన డీఎల్‌పీవో

కొడంగల్ రూరల్, మే 22 : కొడంగల్ మండలం హుసేన్‌పూర్ పంచాయతీలో డీఎల్‌పీవో శంకర్‌నాయక్ బుధవారం నర్సరీ, స్మశాన వాటిక, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. నర్సరీల్లో మొక్కలను వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండన్న, ఫీల్డ్ అసిస్టెంట్ బసప్ప పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నర్సాపూర్‌లో మహారాష్ట్ర పోలీసుల సోదాలు

▸ నిషేధిత ద్రవ మత్తు పదార్థం, తయారీ సామాగ్రి స్వాధీనం

▸ పోలీసులు వచ్చారన్న సమాచారంతో కీలక వ్యక్తి పరారీ

▸ కుటుంబ సభ్యుల్లో ఒకరిని విచారించి వదిలేసిన పోలీసులు

▸ కలకలం రేపిన సంఘటన



నర్సాపూర్‌లో ఉన్న రేకుల షెడ్డు



సామాగ్రి లోడ్ చేసిన ఆటో

మర్పల్లి, మే 22 : బెంగళూరు రామేశ్వరం కేఫే బాంబు పేలుళ్లకు సంబంధం ఉందని అనుమానిస్తున్న ఓ వ్యక్తిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మరువక ముందే మర్పల్లి మండలం, నర్సాపూర్ శివారులోని ఓ రహస్య స్థలంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. నర్సాపూర్ గ్రామంలో చెరువు పక్కనే ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు బుధవారం తెల్లవారు జామున ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మహారాష్ట్ర పోలీసులు రేకుల షెడ్డులో మూడు లీటర్ల వరకు ద్రవ మత్తు పదార్థంతో పాటు నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేసే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలియవచ్చింది.. సంఘటన స్థలంలో స్వాధీనం చేసుకున్న సామాగ్రి వివరాలను వారు తమ ఉన్నతాధికారులకు వివరించినట్లు చెబుతున్నారు. సంఘటన స్థలం ఏ సర్వే నెంబర్‌లోకి వస్తుంది, యజమాని ఎవరు అనే సమాచారం కోసం మహారాష్ట్ర పోలీసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం అధికారులను సంప్రదించి వివరాలు సేకరించారు. నర్సాపూర్ గ్రామంలో సర్వే నెం.48లో ఉన్న పొలంలో రేకుల షెడ్డులో గత కొన్ని రోజులుగా నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతోనే మహారాష్ట్రకు చెందిన థానే పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తుల ద్వారా రాబట్టిన సమాచారం మేరకే మహారాష్ట్ర పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డు వద్దకు పోలీసులు వచ్చిన విషయాన్ని పసిగట్టిన అక్కడున్న ఓ వ్యక్తి చెరువులో దూకి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. కాగా, పారిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొంత సమాచారం సేకరించి అతడిని వదిలేశారు. తాము విచారణకు హాజరు కావాలని సమాచారం ఇచ్చినప్పుడు రావాలంటూ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డులో స్వాధీనం చేసుకున్న సామాగ్రిని ఓ వాహనంలో తమ వెంట మహారాష్ట్రకు తరలించారు. ఈ సంఘటనపై జిల్లా, స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం. కాగా, ఈ సంఘటన జిల్లాలో కలకలం రేపింది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- విత్తనాలు కొన్న రైతుకు బిల్లులు తప్పక ఇవ్వాలి
- రోజువారీగా ధరలను బోర్డుపై రాయాలి
- జిల్లా ఇంటర్నల్ స్క్వాడ్ అధికారుల వెల్లడి
- తాండూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధి ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు



తాండూరులోని ఓ ఫర్టిలైజర్ షాపులో వివరాలు పరిశీలిస్తున్న జిల్లా స్క్వాడ్ అధికారులు

తాండూరు రూరల్, మే 22 : ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అందజేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు, వికారాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ వినోద్‌కుమార్, తాండూరు వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి హెచ్చరించారు. బుధవారం తాండూరులోని హనుమాన్ ఫర్టిలైజర్, రవిరాజ్, సాయిరాం, కావేరి, మన గ్రోమోర్ ఫర్టిలైజర్‌షాపులతోపాటు ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలైన ఎస్‌ఆర్‌ఎంటీ, క్రాంతి, నవత, సప్తగిరి ట్రాన్స్‌పోర్ట్‌లలో విత్తనాల తనిఖీలు నిర్వహించారు.



బషీరాబాద్: కాశీంపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించరాదని ఆదేశించారు. లూజ్ విత్తనాలు ఎవరైనా అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులు కూడా ఎరువులు, విత్తనాలు కొన్న వెం టనే ఫర్టిలైజర్ షాపుల యజమానుల నుంచి బిల్లులు పొందాలని, ఆ బిల్లులను పంటకాలం ముగిసే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. విత్తనాలు మొలకెత్తక రైతులు నష్టపోతే ఆ బిల్లుల ద్వారా నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆయా ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు, విత్తనాలకు స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. రోజూ ధరల పట్టికను బోర్డుపై రాసి ఉంచాలని, రోజువారీ విక్రయాల వివరాలను రిజిష్టర్‌లో నమో దు చేయాలని ఆదేశించారు. రైతులను మో సాలకు గురి చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రశీదుపై పూర్తి వివరాలతోపాటు విత్తనాలకు సంబంధించిన లాట్ నెంబర్, కొనుగోలు చేసిన రైతుపేరు, తండ్రిపేరు, ఊరుపేరు, ఫోన్‌నంబర్ నమోదుచేసి అందజేయాలని ఫర్టిలైజర్ షాపుల యజమానులకు సూచించారు. ఈ తనిఖీల్లో తాండూరు వ్యవసాయ శాఖ ఏవో రజిత తదితరులున్నారు.

బషీరాబాద్: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులకు దుకణాదారులు విధిగా రషీదు ఇవ్వాలని వికారాబాద్, తాండూరు ఏడీఏలు వినోద్‌కుమార్, రుద్రమూర్తి సూచించారు. కాశీంపూర్‌లో ఫర్టిలైజర్ దుకణాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు లైసెన్సు, క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం దుకాణం నిర్వాహకుడితో మట్లాడారు. ఎరువులు, విత్తనాలు కొన్న ప్రతీ రైతుకు పేరు, ఊరు, నిర్ణీత ధర, ఫోన్‌నంబర్‌తో కూడిన రషీదు ఇవ్వాలని ఆదేశించారు. దుకాణాల్లో నకి లీ విత్తనాలు, ఎరువులు ఎవరైనా విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా కేసులు పెడతామన్నారు.వారి వెంట బషీరాబాద్ ఏవో సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.

పెద్దేముల్: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఏడీఏ వినోద్‌కుమార్ అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని ఎరువుల దుకాణంలో ఆయన తనిఖీ నిర్వహించారు. రికార్డులు, ఎరువులు పరిశీలించారు. లూజు విత్తనాలు ఎవరు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు కూడా వాటిని కొనుగోలు చేయొద్దని ఆయన సూచించారు.



పెద్దేముల్: మంబాపూర్‌లోని ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ



పరిగిలోని ఓ షాపులో తనిఖీ చేస్తున్న వ్యయసాయ శాఖ అధికారులు

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

పరిగి: ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేటుకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, పరిగి మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పరిగిలోని పలు ఎరువులు, విత్తనాల షాపుల తనిఖీల నిర్వహించారు. షాపుల్లో రిజిష్టర్లు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలు కొన్న రైతులకు రషీదు ఇవ్వాలని సూచించారు. రైతులు లూజ్‌గా అమ్ముతున్న విత్తనాలను కొనరాదని సూచించారు. ఇలా ఎవరైనా గ్రామాల్లో లూజు బస్తాల్లో తెచ్చి విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. షాపుల్లో నిత్యం విక్రయాలకు సబంధించి స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం గుడ్లు



అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన పగిలిన, కుళ్లిన కోడి గుడ్లు

నవాబుపేట, మే 22 : అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు, కుళ్లిన గుడ్లను సరపరా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. మండలంలోని ఎల్లకొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ కుళ్లిపోయిన గుడ్లను సరపరా చేస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల సరఫరా కోసం కాంట్రాక్టర్‌లను నియమించారు. అయితే ఆ కాంట్రాక్టర్లు కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తున్నారని, మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : మున్సిపల్ చైర్‌పర్సన్



వార్డులో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఎం.పావని

ఘట్‌కేసర్, మే 22 : ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులోని ద్వారాకనగర్ కాలనీ చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. మురుగునీరంతా రోడ్డుపై పారుతుండటంతో స్థానికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఇటీవల స్థానికులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో మురుగునీటిని మళ్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మారుతి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఏఈ సురేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, మే 22 : పాఠశాలల ప్రారంభానికల్లా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తిచేయాలని పీఆర్ ఏఈ సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్‌లోని ప్రాథమిక, బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, దళితవాడ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు గాజులకుంట పాఠశాల, కుబ్యానాయక్ తండా పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను పూర్తిచేయాలని తెలిపారు. నాణ్యతాయుతంగా పనులను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, బందెప్ప, కృష్ణ, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఇంకా వనియోగంలోకి రాని ట్రాన్స్‌ఫార్మర్

కులకచర్ల, మే 22 : కులకచర్ల గ్రామ పరిధిలోని కల్యాణ్‌నగర్ కాలనీలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా చేయకపోవడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అలంకార ప్రాయంగా మారింది. కాలనీలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో లోడ్ ఎక్కువై ప్రజలు తరచూ లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ చౌరస్తా నుంచి పీఎస్ దారిలో ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన కాలనీకి సరఫరా ఇవ్వడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, ఈదురు గాలులు వీస్తుండటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. కల్యాణ్‌నగర్ కాలనీకి లో ఓల్టేజీ సమస్యతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాలనీకి విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు

ధారూరు/పెద్దేముల్, మే22: ధారూరు ప్రాథమిక సహకారం సంఘం కార్యాలయంలో జనుము, జీలుగ విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నామని సొసైటీ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి బుధవారం తెలిపారు. జీలుగ విత్తనాలు ధర కిలోకు రూ.93కాగా సబ్సిడీపై కిలో రూ.37.2 చొప్పున 30 కిలోల బస్తా రూ.1,116కు ఇస్తున్నామని తెలిపారు. జనుము విత్తనాలు కిలో 40కిలోల బస్తా రూ.1448 ఇస్తున్నామన్నారు. విత్తనాలు తీసుకునే రైతులు అధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సు పత్రాలతో పాటు వ్యవసాయ అధికారుల పర్మిట్ పత్రాన్ని తీసుకువచ్చి విత్తనాలు పొందవచ్చని ఆయన సూచించారు. కాగా రైతులకు డీఏపీ ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులు 60శాతం సబ్సిడీపై ఇస్తున్నామని అవసరమైన రైతులు తమ గ్రామ ఏఈవోలను సంప్రదించాలని పెద్దేముల్ ఏవో నజీరుద్దీన్ తెలిపారు. జనుము 40కిలోల బస్తాలు 100 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పర్మిట్లు పొందిన రైతులు తాండూరులోని ఆగ్రోస్ కేంద్రంలో విత్తనాలు తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థులు వ్యక్తిత్వ విలువలతో మెలగాలి



అధ్యాపకుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

వికారాబాద్, మే 22 : వికారాబాద్‌లో శ్రీ సత్యసాయి జ్ఞానకేంద్రంలో యువజన విభాగం ఆధ్వర్యంలో నెల రోజులు నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ తరగతులు బుధవారం ముగిశాయి. జ్ఞానకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి డైట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బందెప్ప గౌడ్, రంగాపూర్ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యక్తిత్వ విలువలు కలిగి క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఏకాగ్రత, పట్టుదల, శ్రమతో లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులకు శిక్షణిచ్చిన అధ్యాపకులు శ్రీనివాస్, చెన్నయ్యలను సత్కరించారు. కార్యక్రమంలో జ్ఞానకేంద్రం కన్వీనర్ సత్యనారాయణగౌడ్, డీవైసీ బసవేశ్వర్, రిటైర్డ్ ఎంఈవో వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ టౌన్, మే 22 : గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ పరిధిలో గురువారం మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్‌కాలనీ, ఊర్జితవిల్లాస్, మాణిక్‌రెడ్డినగర్, ఎస్‌ఎల్‌ఆర్ కాలనీ, నైబర్‌హుడ్ విల్లా, ఏజీ కాలనీల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట సబ్‌స్టేషన్ పరిధి మెట్లకుంట, బుర్రితండా, మైసమ్మగడ్డ తండా, భోజనగడ్డ తండా పరిధిలోని తండాలకు గురువారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగరాజు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు తుంకిమెట్ల, బొట్లవనితండా, దేవుల నాయక్ తండాల పరిధిలోని గ్రామాలకు 11కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్‌లోగల 220కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతల కారణంగా గురువారం ఉదయం 11గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సంస్కృతి టౌన్‌షిప్, ఆర్జీకే కాలనీ, అన్నోజిగూడ, లక్ష్మీనర్సింహ కాలనీ, ఎదులాబాద్, అంకుషాపూర్, మాదారం, చందుపట్లగూడ, ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, మర్పల్లిగూడ, కొత్తగూడ గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోతుంది కనుక విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు పాంబండ గిరి ప్రదక్షిణలో పాల్గొననున్న ఎమ్మెల్యే

కులకచర్ల, మే 22: కులకచర్ల మండంలోని బండవెల్కిచర్ల పాంబండ గిరి ప్రదక్షిణలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి గురువారం పాల్గొంటారని నిర్వాహకులు బుధవారం తెలిపారు. ప్రతీ పౌర్ణమి రోజున ఇక్కడ హిందువులు పాంబండ రామలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. నేడు పౌర్ణమి సందర్భంగా పాంబండ గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారని తెలిపారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, మే 22: ఉద్యానవన తోటల పెంపకానికి నీటి వసతితో అనువైన భూమి కలిగిన చిన్న, సన్న కారు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధి హామీ ఈసీ నర్సింహారెడ్డి బుధవారం తెలిపారు. ఈ దరఖాస్తులను స్థానిక పంచాయతీల్లో కార్యదర్శి లేదా ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అందజేయలన్నారు. జాబ్‌కార్డు కలిగి ఉండి 1 నుంచి 5 ఎకరాల లోపు చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకం రాయితీ పొందేందుకు అర్హులన్నారు. మామిడి, బత్తాయి, సపోట, సీతాఫల్, నిమ్మ, ఆయిల్ పామ్, దానిమ్మ, మునగ వంటి తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు చెక్



రమేశ్, ఎస్ఐ బషీరాబాద్

బషీరాబాద్, మే 22 : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరగిపోతున్నాయని నేరగాళ్ల ఉచ్చులో పడి ప్రజలు మోసపొవద్దని బషీరాబాద్ ఎస్ఐ రమేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఫోన్‌లో వచ్చే అనవసరమైన మెసేజ్‌లు, లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. కేవైసీ అని ఓటీపీ, పాస్ వర్డులు అడిగితే ఎవరికీ చెప్పవద్దన్నారు. ప్రజలు అప్రమత్తతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఎలాంటి వివరాలు అడిగితే స్పందించవద్దన్నారు. స్క్రీన్ రెడ్ కలర్‌గా స్పామ్ కాల్స్‌ను ఎత్తవద్దన్నారు. అమాయకులు చాలా మంది సైబర్ నేరగాళ్ల బారిన పడుతూ వేలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఫోన్‌లో రకరకాలుగా ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకుల నుంచి మట్లాడుతున్నామని, ఆధార్ నంబర్ చెప్పండని, మీ ఏటీఎం పని చేయడంలేదని, లేదా క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని ఇలా ఎన్నో విధాలుగా మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవతలి వారి మాటలు నమ్మొద్దని, అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయలన్నారు. పోలీస్‌శాఖ సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా ఎక్కడోచోట మోసాలకు ప్రజలు గురవుతున్నరన్నారు. సైబర్ మోసాల బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి, వివరాలు తెలిపితే డబ్బు రికవరీ చేసే అవకాశం ఉందన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



బంట్వారం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న కానిస్టేబుల్ పరమేశ్వర్

బంట్వారం మే22 : బంట్వారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నా గొల్ల పరమేష్ తన కుతురు సాన్వి పుట్టినరోజు సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో 350ప్లేట్లు విద్యార్థులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదువుకోని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రప్ప, ।నివాస్,నర్సిములు తదితరులు ఉన్నారు..

ప్రజలకు చేరువగా ఎమ్మెల్యే

- సమస్యలపై నేరుగా ఫోన్ చేసేందుకు అవకాశం
- ప్రతీ సమస్య వివరాలను రిజిష్టర్‌లో నమోదు
- పరిష్కారానికి సత్వర చర్యలు: ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి



పరిగి, మే 22 : పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు శ్రీకారం చుడుతున్నారు. ఆయన నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నప్పటికీ ఇంకా వివిధ గ్రామాల్లోని అందరిని కలిసే అవకాశం లేనివారు నేరుగా ఫోన్ చేసి సమస్యలు చెప్పుకునేలా అవకాశం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాలు, వ్యక్తిగత సమస్యలతోపాటు, గ్రామాల్లో ముఖ్యమైన సమస్యలపై కూడా నేరుగా ఫోన్ చేసి తెలపవచ్చని ఆయన చెప్పారు. ప్రజలు రోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 07948058577 అనే నంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు తన నంబర్ ఉన్నా ఇది కేవలం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన నంబర్ అన్నారు. ఈ నంబర్‌కు ఫోన్‌చేసిన వ్యక్తి వివరాలను సమస్యలపై తన సిబ్బంది రిజిష్టర్‌లో నమోదు చేస్తారని తెలిపారు. సదరు సమస్యను సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం నుంచే ఫోన్ చేయవచ్చని సూచించారు.



కులకచర్ల రామలింగేశ్వర కళాశాల

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కులకచర్ల, మే 22: ఇంటర్‌మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి 31 వరకు స్థానిక శ్రీ రామలింగేశ్వర కళాశాలలో నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. మొదటి సంవత్సరం ఇంటర్‌లో 824 మంది, ద్వితీయ సంవత్సరంలో 394మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ కామేశ్వరి తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే సెంటర్‌కు చేరుకోవాలని ఆమె సూచించారు. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఇతర వసతులు కల్పించామని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తల వాగ్వాదం



చెన్‌గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డితో వాదనకు దిగిన కార్యకర్తలు, కుటుంబీకులు



పూడూరు, మే 22 : బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగిన సంఘటన పూడూరు మండలం చెన్‌గోముల్ పోలీసుస్టేషన్ వద్దచోటు చేసుకుంది. కద్మూరుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నెల 13న పోలింగ్ నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సురేష్ బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కద్మూరుకు చెందిన నలుగురు బీఆర్ఎస్ నాయకులను బుధవారం అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. తమకు సమాచారం ఇవ్వకుండా అరెస్టు చేశారని కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. వారిని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. విచారణకు సహరించాలని డీఎస్పీ వారికి సూచించి గ్రామానికి పంపించారు.

వర్షాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు సన్నాహక చర్యలు

వికారాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే వర్షాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు సర్కిల్ పరిధిలో చేపట్టిన సన్నాహక చర్యలు సమర్థవంతంగా పూర్తి చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో విద్యుత్ పంపిణీ, సరఫరా తీరుతెన్నులపై సమీక్ష నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వేసవి సీజన్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందన్నారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా నిత్యం అప్రమత్తంగా ఉంటూ నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా సమర్థంగా విధులు నిర్వహించారని సిబ్బందిని, అధికారులను అభినందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వర్షాకాలం ముందస్తు నిర్వహణ, మరమ్మతు పనుల్లో భాగంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. లైన్లకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ల తనిఖీ, వదులుగా ఉన్న తీగలను సరిచేయడం వంటి పనులను సమర్థవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్ఈ, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు

- కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసిన పోచారం ఐటీసీ పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, మే 22 : కోర్టు ఆదేశాల మేరకు ఓ కాంగ్రెస్ సీనియర్ నాయకుడిపై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న పోచారం మున్సిపల్, అన్నోజిగూడ ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు కొంతం శంకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి పాల్గొన్నారు. కాగా అదే ఫంక్షన్ హాల్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి సమావేశం జరుగుతుండగానే శంకర్‌రెడ్డిని అవమానిస్తూ అసభ్యకరంగా దూషించి నేను నీకంటే సీనియర్ అంటూ అతడి చెంపపై కొట్టాడు. మరుసటి రోజు విషయం తెలుసుకున్న శంకర్‌రెడ్డి కుమారుడు కిరణ్‌రెడ్డి వెళ్లి మా నాన్నను ఎందుకు కొట్టావని శ్రీకాంత్‌రెడ్డిని నిలదీశాడు. దీంతో కిరణ్‌రెడ్డిని శ్రీకాంత్‌రెడ్డి దూషించి మీ నాన్ననే కాదు నిన్నూ కొడుతానంటూ దాడిచేశాడు. దీంతో కిరణ్‌రెడ్డి ఈ నెల 8న పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై పోలీసులు కోర్టుకు వివరించగా, కోర్టు శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోర్టు పోచారం ఐటీసీ పోలీసులకు సూచించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

పీర్జాదిగూడ మేయర్, పలువురు కార్పొరేటర్లపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మే 22 : పీర్జాదిగూడ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న పీర్జాదీగూడ కార్పొరేటర్ అమర్‌సింగ్(కాంగ్రెస్) పెద్ద అంబర్‌పేట్‌లోని బంధువుల శుభకార్యానికి పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులతో కలిసి వెళ్లారు. శుభకార్యం ముగియగానే తన అనుచరులతో కలిసి ఇంటికి వస్తుండగా పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు హరిశంకర్‌రెడ్డి, అనంతరెడ్డి, రఘుపతిరెడ్డి, కొడె పోచయ్య, బండి సతీష్, రవీందర్, కొత్తూరి మహేష్, మద్ది యుగేందర్‌రెడ్డి, మధుసూదన్, జావీద్‌ఖాన్, ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్, అతడి ముఖ్య అనుచరులు కలిసి అమర్‌సింగ్ ప్రయాణిస్తున్న కారును టోల్‌ప్లాజా వద్ద అడ్డగించి దాడికి యత్నించారన్నారు. తనను అనుసరించిన వారిని గుర్తుపడతానని అమర్‌సింగ్ పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తలకొండపల్లి, మే 22: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి సమీపంలో జంగారెడ్డిపల్లి-ఆమనగల్లు రహదారిపై బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చౌదర్‌పల్లికి చెందిన కూరాకుల మల్లేశ్ (40) ఆమనగల్లు నుంచి బైక్‌పై చౌదర్‌పల్లికి వస్తున్నాడు. జంగారెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన మహేశ్వరం డిపో బస్సు బైక్‌ను ఢీకొనడంతో మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు.